5న కలెక్టరేట్ ఎదుట ధర్నా

- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రం గీతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నాను విజయవంతం చేయాలంటూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) జిల్లా నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం ఈనెల లోపు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని ఓపీఎస్‌ను అమలు చేయాలని, 317జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులందరిని వారి సొంత జిల్లాలకు పంపించాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25న సంవరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల 29రోజుల సమ్మె కాలపు జీతాన్ని చెల్లించాలని అన్నారు. డీఈవో, డిప్యూటీ డీవో, నూతన మండలాలకు ఎంఈవో పోస్టులను మంజూరుచేయాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి ఖాళీల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్కాల రవీందర్, దుమాల రమానాథ్‌రెడ్డి, ఆవురం సుధాకర్‌రెడ్డి, కమ్మరి మల్లేశం, జింగిటి రాజు, విక్కుర్తి అంజయ్య, కర్రోళ్ళ రాజలింగం, మహేందర్‌రావు, అంబటి రమేష్, రాజేశం, చక్రపాణి, ఎలగొండ రవి పాల్గొన్నారు.

వధువుల వేట



- జిల్లాలో పెరుగుతున్న పెళ్లి కాని యువకుల సంఖ్య
- ఈడు దాటిపోతున్నా ఆర్థిక స్థిరత్వం కోసం తండ్లాట
- శ్రావణ మాసంలో భారీగా శుభముహూర్తాలు
- ఆదివారం ప్రత్యేకం



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పెళ్లి వేడుక ప్రతి కుటుంబంలో అతి ముఖ్యమైన సంబరం. పెళ్లంటే నూరేళ్ల పంటగా భావిస్తారు. కల్యాణం కమనీయంగా ఉత్సాహాన్ని నింపుతుంది. ఈ పెళ్లి తంతు కోసం దూరతీరాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు తరలివస్తారు. ఈనెల నుంచి పెళ్లి ముహూర్తాలు ఎన్నో ఉన్నాయి. రాజన్న సిరిసిల్లలో పెళ్లి వేడుకలకు సిద్ధమయ్యారు. ఈనెలలో 3,5,7,8,9, 10,11,12,13,14,17,18, సెప్టెంబరులో 24,27, అక్టోబరులో 5,8,11,12,24,26,27,29,30,31, నవంబరులో 1,7,8, 13,15,23,26 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణ, కార్తీక మాసాలు ముహూర్తాలకు నెలవు. కానీ వధువు ఎక్కడ అనే పరిస్థితుల్లో అబ్బాయిలు ఆరాట పడుతున్నారు. మరోవైపు తల్లిదండ్రులు 'మా అబ్బాయి... ఎంటెక్ అయిపోయింది. సంవత్సరానికి 3 లక్షలకు పైగా సంపాదన వస్తోంది. ఎక్కడైనా అమ్మాయి ఉంటే చెప్పండి'.. అంటూ సూచిస్తున్నారు. 'మా వాడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. పట్టింపులేవి లేవు.. కట్నకానుకలు అవసరం లేదు.. అమ్మాయి అందంగా ఉంటే చాలు..' అంటూ వధువుల కోసం వెతుకులాడుతున్న సందర్భాలు జిల్లాలో అనేకం కనిపిస్తున్నాయి. కారణం చదువు, ఉద్యోగం ఆర్థికంగా స్థిరపడిన తరువాత వివాహం ఆలోచనలోకి వెళ్లడంతో అబ్బాయిలు ముదిరిపోయి పెళ్లి కాని ప్రసాద్‌లుగా మారిపోతున్నారు.

మరోవైపు ఆడ శిశువు అనగానే గర్భంలోనే చంపేస్తున్న ఘటనలతో అమ్మాయిల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుందనే ఆందోళనలు కూడా వ్యక్తం అవుతున్నాయి. జీవితాంతం ఆనందమయంగా గడపాలని అందరూ కోరుకుంటారు. తమ జీవితాన్ని ఆకర్షణీయంగా ఉండాలని ఆశిస్తారు. అందుకోసం ఉద్యోగం, డబ్బు సంపాదనే ముఖ్యమనే తత్వంతో యువకులు ఉండిపోతున్నారు. అదేక్రమంలో యువతులు కూడా చక్కని ఉద్యోగం చేసే భర్త కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనే జీవితంలో స్థిరపడాలనే తపనతో ఈడు దాటిపోవడంతో యువకులు వధువుల కోసం వెతుకులాడే పరిస్థితి పెరిగిపోతోంది. ఎక్కడ చూసినా 'ఎక్కడైనా ఆడపిల్ల ఉంటే చెప్పండి.. మా వాడు సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్నాడు..' అంటూ తల్లిదండ్రులు అడుగుతున్న తీరు తరచూ కనిపిస్తోంది. గతంలో ఉన్న పట్టింపులను కూడా మరిచి, రాశి, నక్షత్రం, గోత్రం వంటి వాటిపై పట్టింపులు లేకుండా అమ్మాయి బాగుంటే చాలని అడుగుతున్న వారు కూడా ఉన్నారు. మరోవైపు సంపాదనలో ఉన్న యువకులు మరో సంపాదించే అమ్మాయే భార్యగా రావాలని కోరుంటున్న వారు కూడా ఉన్నారు. దీంతో అందమైన పిల్ల, ముల్లె రెండూ ఒకచోట లభించక కూడా పెళ్లి సంబంధాలు చూస్తుండడంతోనే వయస్సు కాస్తా దాటిపోతోంది.

లేటు వయస్సు పెళ్లిళ్లతో ఇబ్బందులు..

వయస్సు దాటిన తరువాత వివాహాలు చేసుకోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. సరైన వయస్సులో వివాహం జరగకపోవడంతో పిల్లలు కలుగక మానసికంగా ఆందోళన చెందుతున్న సందర్భాలు అనేకం కనిపిస్తున్నాయి మరోవైపు పిల్లలు కలిగినా వారు చదువుకునే వయస్సులో.. తల్లిదండ్రుల వృద్ధాప్యంలోకి వెళ్లిపోవడంతో ఆరోగ్య సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారు.

● సహజీవనం మధురమైనది..

సహజీవనం అనేది ఒక మధురమైన జీవన విధానం. దాంపత్య జీవనం సరిగమలనే పలికించాలి. అపస్వరాలకు చోటివ్వకుండా సాఫీగా సాగిపోవాలి. కానీ చాలా కాపురాలు కుప్పకూలి పోతున్నాయి. అందుకు కారణం వయస్సు పైబడిపోయిన

మిగతా 8వ పేజీలో

స్నే'హితుల'తోనే కలకాలం.. ⑦
- నేడు ఫ్రెండ్‌షిప్ డే..

'ఇందిరమ్మ' ఇళ్లపై అనాసక్తి.. ⑧
- 98 ఇళ్లు రద్దు చేసిన అధికారులు

మహిళల కోసం ప్రత్యేక చట్టాలు..

- సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైశ్వాల్



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్

తంగళ్లపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రత్యేక చట్టాలున్నాయని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైశ్వాల్ అన్నారు. ఈనెల 9వ తేదిన ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. అనంతరం సీనియర్ సివిల్‌జడ్జి రాధిక జైశ్వాల్ మాట్లాడుతూ చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆదివాసీలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేని వారికి ప్రభుత్వం న్యాయవాదిని నియమించి న్యాయాన్ని అందిస్తుందని, ఇతర చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, ఆడెపు వేణు, న్యాయవాదులు పర్శరాములు, మల్లేశ్ యాదవ్, కుంట శ్రీనివాస్, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ రేహన ఇఫాత్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ప్రభుత్వ కార్యాలయాలు



అంధకారంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం

కోనరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు అంధకారంలో కొట్టుమిట్టాడున్నాయి. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు రాత్రిపూట లైట్లు లేక అంధకారంలో ఉన్నాయి. ప్రధాన కార్యాలయాల ఆవరణలో లైట్లు లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట లైట్లు ఉండేలా అధికారులు చూడాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు కాజ్‌వే నిర్మాణం ప్రారంభం



కాజ్ వే పనులను చేపడుతున్న అధికారులు

కోనరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాని కల్వర్టు స్థానంలో కాజ్ వే నిర్మాణం పనులు శనివారం ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రానికి వెళ్లే లో లెవెల్ కల్వర్టు కూలిపోయి ప్రమాదకరంగా మారింది. నిత్యం మల్కాపేట రిజర్వాయర్ నీరు వెళ్లడంతో వాహనదారులు, అధికారులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రోత్సాహంతో ఆర్ అండ్‌బీ ఏఈ దివ్య పనులు ప్రారంభించారు. కాగా, మండల కేంద్రానికి వెళ్లే ప్రజలు, వాహనదారులు నిమ్మపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లాలని ఏఈ దివ్య సూచించారు.

జాతీయ స్థాయి సదస్సులో పాల్గొన్న న్యాయవాది

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి న్యాయ సదస్సులో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా వైస్ చైర్మన్ కొండాపురం వెంకట్‌రెడ్డి శనివారం పాల్గొన్నారు. రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, దృక్పథం, సవాళ్ల అనే అంశంపై ఆయన ప్రసంగించారు.

సమస్యలు పరిష్కరించాలి..

- మధ్యాహ్న భోజన కార్మికుల వినతి



సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన నిర్వాహణ బిల్లులు ఈ-కుబేర్ నుంచి మినహాయించాలని, ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని శనివారం తెలంగాణ మాధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం)నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలోని సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి జీ శ్రీధర్ మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లుతో పాటు, వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలన్నారు. కొత్త మెనూకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 10వేలు వేతనం పెంచి ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించాలన్న ఆలోచనను ప్రభుత్వం మానుకో వాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 6న చలో హైదరా బాద్ ధర్నా కార్యక్రమం తలపెట్టినందున జిల్లా విద్యాధికారికి వినతి పత్రం ద్వారా ముందస్తు సమాచారం ఇచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠ శాలలో మధ్యాహ్న భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికులు ధర్నాలో పాల్గొనా లని కోరారు. ఈ కార్యక్రమంలో మాదం లక్ష్మి, మెరుగు లక్ష్మి పాల్గొన్నారు.

త్రిఫ్ట్ పథకం డబ్బులు అందించాలి..

- సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమణ

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మరమగ్గాల కార్మికులకు రావాల్సిన త్రిఫ్ట్ పథకం డబ్బులను చేనేత దినోత్సవం రోజున ఇవ్వాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశానికి హాజరైన చేనేత జౌళిశాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్ వెంకటరమణారావును సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కలిసి త్రిఫ్ట్ పథకానికి సంబంధించిన డబ్బులను కార్మికులకు ఇప్పించాలని వినతిపత్రాన్ని అందించారు. అలాగే సిరిసిల్లతోపాటు టెక్స్‌టైల్ పార్క్ పవర్‌లూం వస్త్ర పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు, వార్పిన్, వైపని అనుబంధ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న పదిశాతం యారన్ సబ్సిడీ, వర్కర్‌టూ ఓనర్ పథకంతోపాటు కార్మికుల ఉపాధి సంక్షేమానికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కారించాలనే డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ఉత్పత్తి చేయిస్తున్న ఇందిరా మహిళా శక్తి చీరలకు సంబంధించి మరమగ్గాల కార్మికులతో పాటుగా వార్పిన్, వైపని అనుబంధ రంగాల కార్మికులందరికి పదిశాతం యారన్ సబ్సిడీని వర్తింపజేయాలన్నారు. మే నెలతో ముగిసిన త్రిఫ్ట్ పథకానికి సంబంధించి కార్మికులకు రావాల్సిన డబ్బులను కాలయాపన చేయకుండా ఆగస్టు 7న చేనేత దినోత్సవం రోజు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కొత్తగా ప్రారంభించిన త్రిఫ్ట్ పథకాన్ని అమలుచేసి జూన్ నుంచి డబ్బులు కట్టుకునే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా వర్కర్‌టూఓనర్ పథకాన్ని పూర్తిచేసి కార్మికులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లే సత్యం, బెజుగం సురేష్, చింతకింది మధుసూదన్, దోమల రామ్ పాల్గొన్నారు.

నేత కళాకారుడు హరిప్రసాద్‌కు నాగుల మల్లయ్య పురస్కారం

- అవార్డు కమిటీ కన్వీనర్లు నాగుల సంతోష్, ఎండీ సలీం వెల్లడి

- రేపు పురస్కార ప్రదానం

సిరిసిల్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగుల మల్లయ్య స్మారక అవార్డుకు సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు ఎల్ది హరిప్రసాద్‌ను ఎంపిక చేసినట్లు నాగుల మల్లయ్య అవార్డు కమిటీ కన్వీనర్లు నాగుల సంతోష్, ఎండీ సలీంలు తెలిపారు. శనివారం సిరిసిల్లలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి అవార్డును అందిస్తున్నట్లు తెలిపారు. 2025సంవత్సరానికి హరిప్రసాద్‌కు అవార్డును ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని టౌన్‌క్లబ్ ఆవరణలో సోమవారం ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, నాగుల మల్లయ్య పురస్కార కమిటీ చైర్మన్ నాగుల సత్యనారాయణలు హాజరవుతారని తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు..

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - 144 మందికి ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆన్‌లైన్ డిజిటల్ క్లాస్‌లను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో 2వేల మందికి పైగా ఇళ్లు లేవని లెక్కలు చెబుతున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళుతానని, అందరికి ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం 144 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ స్వంత ఇల్లు, జాగా లేని పేదలకు ఇందిరమ్మ రాజ్యంలో వారి కల నెరవేరుతుందన్నారు. పట్టణంలోని 144 మంది అర్హులైన వారికి బస్ డిపో పక్కన ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించి నిరుపయోగంగా మారిన ఇళ్లను పేదలకు పంపిణీ చేస్తున్నామన్నారు. 12 బ్లాక్‌లలో జీ ప్లస్-2తో 144మందికి ఇళ్లు అందుబాటులో ఉండటంతో మంజూరు పత్రాలు అందజేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ రాజన్న ఆలయానికి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.150 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మూలవాగుపై మూడో బ్రిడ్జి ఎందుకు నిర్మాణం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రంగురంగుల బ్రోచర్లతో మూలవాగుపై బ్రిడ్జి నిర్మాణ ఫొటోలు చూపించింది మీరు, మీ ప్రభుత్వం కాదా.. అని ప్రశ్నించారు. వంతెన భూసేకరణకు డబ్బులు రాలేదని ఆరోపిస్తున్నారని, రూ.6 కోట్ల నిధులు మంజూరైంది నిజం కాదా అని ప్రశ్నించారు. కొన్ని ఇళ్లు వక్ఫ్ బోర్డు పరిధిలో ఉండటంతో పరిహారం తీసుకోలేదని, రూ.47కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేస్తే నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించామన్నారు. పట్టణంలో 2వేల మందికిపైగా ఇళ్లు లేవని లెక్కలు చెబుతున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళుతానని, అందరికి ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్‌చైర్మన్ కనికరపు రాకేష్ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య..

సీఎం రేవంత్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల పిల్లలందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో ఆన్ అకాడమీ ఆన్‌లైన్ తరగతులను శనివారం ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించి మహిళా శిశు సంక్షేమ శాఖ సహకారంతో జిల్లాలోని అన్ని పాఠశాలలకు విస్తరించడం మంచి శుభ పరిణామం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు పటిష్టమైన చర్యలు

- సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు.. - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆయిల్‌పామ్ పంటల సాగుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెంచేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆయిల్‌పామ్ మొక్కల సరఫరా చేసేందుకు ప్రీ యూనిక్యూ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి కేటాయించిందని అన్నారు. ఆయిల్‌పామ్ నర్సరీని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దబోనాల వద్ద రెండు ఎకరాలలో ఏడాది వయస్సులో ఉన్న మొక్కలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. నీటి పారుదల సౌకర్యం ఉన్న రైతులకు మొక్కలను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మండలాల వారిగా ఎంత టార్గెట్ ఇచ్చారు. ఎంత పూర్తి చేశారో వివరాలను వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. నర్సరీ ఎక్కడ ఉంది దానిలో ఎన్ని మొక్కలు ఉన్నాయి. ఏ విత్తనం వాడుతున్నారని మొక్కలు సరఫరా చేసే కంపెనీ బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌పామ్ సాగు కోసం అవసరమైన డ్రిప్ ఇరిగేషన్ అందుబాటులో ఉందని వెల్లడిం చారు. జనరల్ కేటగిరి రైతులకు 80 శాతం, సన్న , చిన్న కారు రైతులకు 90 శాతం, ఎస్సీ ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తామన్నారు. జిల్లాలో 772 మంది రైతులు 2280 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటలను సాగు చేస్తున్నారని, ఈ ఆర్థిక సంవత్సరం మరో రెండు వేల ఎకరాల సాగు లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించామని పేర్కొన్నారు. రెండు శాఖల అధికారులు సమన్వయంతో ఆయిల్‌పామ్ సాగుతో కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించాలన్నారు. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని వివరించారు. అధికారులు నిర్ణయించిన లక్ష్యం తప్పకుండా పూర్తిచేయాలని సూచించారు. అర్హత, ఆసక్తి ఉన్న రైతులు తమ పరిధిలోని వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. ప్రతివారం వ్యవసాయశాఖ ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాలని, లక్ష్యం ఎంత వరకు పూర్తి చేశారో ఆరాతీయాలని, అసైన్డ్ భూముల సాగుచేస్తున్న రైతులపై దృష్టి సారించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు పెంచేలా చూడాలన్నారు. సమావేశంలో ఉద్యానవన శాఖ డీడీ శేఖర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ మద్యం దుకాణం సమీపంలో మండల కేంద్రానికే చెందిన హమాలీ కార్మికుడు ఒగ్గు మల్లయ్య(60) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి కథనం మేరకు.. మల్లయ్య స్థానికంగా హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల1న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. శనివారం మధ్యాహ్నం గ్రామంలోని ఓవ్యక్తికి మద్యం దుకాణం సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద మల్లయ్య కిందపడి అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. దీంతో అతడు కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకుని చూసేసరికి మల్లయ్య చనిపోయి ఉన్నాడు. మృతుడు మల్లయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

జగిత్యాలరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని వంజరిపల్లి గ్రామానికి చెందిన మోతుకు రాజు అనేవ్యక్తి ఇంటి సమీపంలోని ప్రహరీ పక్కననాలుగు గంజాయిమొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. మోతుకురాజు తన ఇంటిలో గంజాయి మొక్కలు పెంచుతున్నాడనే సమాచారం మేరకు పోలీసులు అతని ఇంటికెళ్లి తనిఖీచేసి నాలుగు మొక్కలను గుర్తించారు. గంజాయి మొక్కలను సీజ్‌చేసి మోతుకు రాజుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల రహదారిపై కొత్తపల్లి వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి జగిత్యాల వైపునకు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. కారులో ఉన్న ముగ్గురిలో ఇద్దరికి గాయపడ్డారని, ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి ఫిర్యాదు అందలేదని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

పారాక్వాట్.. ప్రాణాంతకం

- గడ్డి మందులతో రైతుల ఆరోగ్యంపై ప్రభావం
- విషపూరితమైన మందుతో పార్కిన్సన్ వ్యాధి



చొప్పదండి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పారాక్వాట్ డైక్లోరేడ్(పెస్టిసైడ్) అనేది ఒక క్రిమిసంహారక మందు. దీనిని వ్యవసాయంలో కలుపు మొక్కలను నాశనం చేయడానికి రైతులు ఉపయోగిస్తున్నారు. పంట పొలాల్లో గడ్డిని తొలగించడానికి ఇది ఉపయోగపడుతుందని రైతులు ఈ మందును విస్తృతంగా పిచికారి చేస్తున్నారు. పారాక్వాట్ మందు ప్రాణాంతకంగా మారుతుందని, ఈ మందు పిచికారి చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అధికారులు చెబుతున్నారు. అత్యంత విషపూరితమైన ఈ మందుతో రైతులు పార్కిన్సన్ వ్యాధిన బారిన పడే అవకాశాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతు న్నారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా వాడుతున్న ఈ మందును 50 దేశాల్లో నిషేధించారు. పారాక్వాట్ మందు పంట పొలాలకు కలుపు నివారణకు ఉపయోగించే అత్యంత ప్రమాదకరమైనది, విషపూరితమైనదిగా మందు డబ్బాలపైనే కంపెనీలు తెలియజేస్తున్నాయి. మందు ను పిచికారి చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో ఆరోగ్యంపై ప్రభావం చూపే ఆస్కారం ఉంది. ఈ మందు నాడి వ్యవస్థను దెబ్బతీస్తుంది. తరచూ ఈ మందులను పిచికారి చేసే రైతులకు దీర్ఘకాలిక వ్యాధులైన పార్కిన్సన్స్(చేతులు వణుకుతాయి) వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. విదేశాల్లో ఈ మందును వాడిన అనేక మంది రైతులు పార్కిన్సన్స్ బారిన పడినట్లు సమాచారం. యూరప్ సహా అనేక దేశాల్లో ఈ మందులను నిషేధించారు. ఈ మందుల ప్రభావం ఊపిరితిత్తులు, చర్మం, కళ్లపై కూడా పడే అవకాశం ఉంది. రైతులు, రైతు కూలీలతోపాటు పర్యావరణం, జీవ వైవిధ్యంపై కూడా ప్రభావం పడుతుందని అధికారులు చెబు తున్నారు.

● సూచనలు, జాగ్రత్తలు...

రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పారాక్వాట్ మందును వాడిన సందర్భంలో పలు జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలి. పారాక్వాట్ మందు డబ్బాపై ఉన్న సూచనలు పాటించాలి. నిర్దేశించిన మోతాదులో మాత్రమే మందును వాడాలి. ఇతర మందులతో ఈ మందును కలుపవద్దు. మందు తయారీదారు చేసిన సూచనల ప్రకారమే మందును పిచికారి చేయాలి.

రైతులు రక్షణ చర్యలు చేపట్టాలి...

- వంశీకృష్ణ, వ్యవసాయాధికారి, చొప్పదండి



పారాక్వాట్ మందును పిచికారి చేసే సమయంలో రైతులు పలు రక్షణ చర్యలు చేపట్టాలి. చేతులకు, గ్లౌజులు, ముఖానికి మాస్కును తప్పనిసరిగా ధరించాలి. శరీరానికి తగలకుండా జాగ్రత్తపడాలి. మందు పొగను పీల్చడం ప్రమాదకరం కాగా రైతులు గాలి వచ్చే దిశలో పిచికారి చేయాలి. మందును మోతాదుకు మించి పిచికారి చేస్తే విష ప్రభావం అధికంగా ఉంటుంది. శ్వాస కోస వ్యవస్థకు హాని జరగకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

రైల్వే గేట్ల మధ్య చిక్కుకున్న కారు

● గేట్‌మన్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం



రైల్వే గేటు లోపల చిక్కుకున్న కారు

కొడిమ్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామ శివారులో శనివారం రైల్వేగేట్ల మధ్య కారు చిక్కుకుంది. రైలు వస్తుందన్న సమచారంతో గేట్‌మన్ రైల్వే గేట్ వేసి రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. అదే సమయంలో కరీంనగర్ నుంచి జగిత్యాల వైపువెళ్తున్న కారుగేటు లోపలికి చేరుకుంది. రెండు వైపులా గేట్లు మూసుకున్నాయి. ప్రమాదాన్ని పసిగట్టి అప్రమత్తమైన గేట్‌మన్ సిగ్నల్‌తో కొంతసేపు రైలును నిలిపివేసినట్లు నమిలికొండ గ్రామస్థులు తెలిపారు. అనంతరం రైల్వేగేట్లను తెరవడంతో కారు బయటకు వెళ్లిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పింది.

మొబైల్ ఫోన్ దొంగిలించి డబ్బులు డ్రా చేసిన వ్యక్తి అరెస్ట్



దొంగను అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేష్ బి గీతే

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ దొంగిలించి ఫోన్ పే ద్వారా డబ్బులు డ్రా చేస్తూ మోసాలకు పాల్పడుతున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం అలీపూర్‌జిల్లా పున్సపర గ్రామానికి చెందిన బర్మన్ హరి(32)ని అరెస్ట్ చేశామని ఎస్పీ మహేష్ బి గీతే తెలిపారు. శనివారం రాత్రి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బర్మన్ అనేవ్యక్తి ఇంటర్ వరకు చదువుకుని దురలవాట్లకు అలవాటుపడి మొబైల్స్ దొంగిలించి అందులో ఉన్న ఆధార్ కార్డు, పాన్‌కార్డుల సహాయంతో ఫోన్ పే, గుగూల్‌పే పాస్‌వర్డ్ రీసెట్ చేసి డబ్బులు వేరే అకౌంట్‌కి పంపించుకుంటాడు. ఈ డబ్బుతో జల్సా చేసేవాడు. ఇందులో భాగంగా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన సిరికొండ శ్రీనివాస్ అనేవ్యక్తి 12 మార్చి 2025న రైలులో తిరుపతి వెళ్తున్న క్రమంలో అతనిభార్య ఫోన్‌ను దొంగిలించాడు. ఆ ఫోన్‌లో ఉన్న ఫోన్‌పే ద్వారా పలు దఫాలుగా తన అకౌంట్లో నుంచి రూ.5.12లక్షలు మరో అకౌంట్‌కు బదిలీ చేశాడు. బ్యాంకు స్టేట్‌మెంట్ ద్వారా శ్రీనివాస్ రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశాడు. ఈ కేసు విచారణలో భాగంగా చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు, జిల్లా సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్, కానిస్టేబుళ్లు కిట్టు, మహేశ్, గంగిరెడ్డి, రాజు అధ్వర్యంలో స్పెషల్ టీం ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా నిందితుడు బర్మన్ హరిని విజయవాడలో అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

గంజాయి అమ్మడానికి వచ్చిన యువకుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సిరిసిల్ల రూరల్ సీఐ

ఇల్లంతకుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంజాయిని అమ్మడానికి వచ్చిన మాతంగి మనీష్ అనే యువకుడిని అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలప్రకారం.. చింతలకుంట గ్రామానికి చెందిన మనీష్ కరీంనగర్‌లోని ఓ వాటర్‌ప్లాంటులో పని చేస్తూ మత్తుకు, జల్సాలకు అలవాటుపడ్డాడు. త్వరగాడబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కరీంనగర్‌లోని ఓ వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలుచేసి ఇల్లంతకుంటలో అమ్మడానికి శనివారం వస్తున్నాడనే సమాచారం మేరకు బతుకమ్మతెప్ప వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేశారు. తనిఖీలలో మనీష్ పట్టుబడగా, అతని వద్ద 110గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టుచేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై శ్రీనివాస్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జ్యోతినగర్‌లో నివాస ముండే బండారి రాకేష్(30) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో రాకేష్ మెకానిక్‌గా పని చేసే వాడు. కొంతకాలంగా అనారోగ్య కారణాలు, మానసికస్థితి సరిగా లేకపోవడంతో చికిత్స చేసుకుంటున్నట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వన్‌టౌన్ ఎస్ఐ రమేష్ ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

● 2.1 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నిందితులను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ రఘు చందర్

జగిత్యాల క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముఠాను శనివారం జగిత్యాల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురి నుంచి 2.150 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ శనివారం వివరాలు వెల్లడించారు. కొడిమ్యాల, జగిత్యాల పట్టణ ఎస్సైలు సందీప్, రవి కిరణ్‌లు తమ సిబ్బందితో పూడూర్‌తో పాటు మిషన్ కాంపౌండ్ ప్రాంతాల్లో సోదాలు చేశారన్నారు. పూడూర్‌లో ఇద్దరు, మిషన్ కంపౌండ్‌లో ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడ్డారన్నారు. కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన గుండు ప్రశాంత్, మల్యాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన బాలె నవీన్, గంగాధర మండలం వెంకటాయపల్లికి చెందిన వంశీ అనే ముగ్గురితో పాటు జగిత్యాల పట్టణంలోని లింగంపేటకు చెందిన ఆవునూరి రణధీర్, తులసీ నగర్ ప్రాంతానికి చెందిన ఆకుల అమర్నాథ్, రాయరపు మల్లికార్జున్ అనే ఆరుగురు యువకులు వేర్వేరుగా రెండు ముఠాలుగా ఏర్పడ్డారని తెలిపారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని జగిత్యాల జిల్లాకు తీసుకవచ్చి విక్రయిస్తున్నారన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని డోర్నకల్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ప్రాంతం నుంచి బైక్, ట్రైన్‌లో వెళ్లి 3కిలోలగంజాయిని కొనుగోలు చేసి జగిత్యాలజిల్లాకు తీసుకువచ్చినట్లు డీఎస్పీ వివరించారు. జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూర్, పట్టణం లోని మిషన్ కంపౌండ్‌లో ఆరుగురు ముఠా సభ్యుల్లో వంశీ అనే యువకుడు పరారీలో ఉండగా మిగతా ఐదుగురు యువకులు గంజాయి సేవించే వ్యక్తులకు విక్రయించేందుకు రాగా పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో జగిత్యాల టౌన్, మల్యాల సీఐలు కరుణాకర్, రవి, ఎస్సైలు రవి కిరణ్, సందీప్, హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, సిబ్బంది మహేష్ కుమార్, అరుణ్, కిరణ్, రాకేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మానకొండూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్టు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన కెక్కర్ల సురేష్(27) అనే యువకుడు కరీంనగర్‌లోని ఓ షోరూంలో పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం మద్దికుంట నుంచి కరీంనగర్‌కు తన మోటార్ సైకిల్‌పై కరీంనగర్‌కు వెళ్లి రాత్రి పని ముగించుకొని మద్దికుంటకు బయలుదేరాడు. మండలంలోని పోచంపల్లి వద్ద రోడ్డుపై టిప్పర్ ఆగి ఉంది. రాత్రి టిప్పర్ కనిపించకపోడంతో వెనకాల నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా గ్రామస్థులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రియాంక, రెండేళ్ల కూతురు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డు ప్రమాదానికి గల కారణాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

రైతులకు సాగునీరివ్వండి

● లేని పక్షంలో మంత్రుల పర్యటనను అడ్డుకుంటాం

● మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): చేతులెత్తి మొక్కుతున్న రైతులకు సాగునీరివ్వాలని చొప్పదండి మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏ మొఖం పెట్టుకుని కరీంనగర్‌కు నీటిపారు దల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వస్తున్నారని ప్రశ్నించారు. కన్నెపల్లి పంపుహౌజ్ ద్వారా నీళ్లు ఎత్తిపోసి కరీంనగర్‌లో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మంత్రుల పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కాలువలు, చెరువుల్లో నీళ్లు లేక ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఆనాటి రోజులు అంటే నాటికాంగ్రెస్ పాలనకరువు రోజులు గుర్తు చేస్తున్నారని ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు ఎత్తిపోసి నీరందించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో ఒకఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం అర్ధరాత్రి తరువాత వన్‌టౌన్ పోలీసులు దాడిచేశారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.12400నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో అశోక్‌నగర్, గాంధీనగర్, హనుమాన్ నగర్, రామగిరి మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన వారు ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం



అయిలాపూర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం అయిలాపూర్‌లో కాంగ్రెస్,బీఆర్ఎస్ శ్రేణుల మధ్య శనివారం వాగ్వాదం జరిగింది. యూరియా పంపిణీపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అసత్య ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలు చర్చించేందుకు ఎమ్మెల్యే అయిలాపూర్‌లోని రైతు వేదికలో బహిరంగ చర్చకు రావాలని రెండురోజుల క్రితం కాంగ్రెస్ నాయకులు సవాల్‌విసిరారు. దీంతోశనివారం నియోజకవర్గంలోని బీఆర్ఎస్‌శ్రేణులు అయిలాపూర్ గ్రామానికి భారీ సంఖ్యలో చేరుకున్నారు. అప్పుడికే రైతు వేదికలో కాంగ్రెస్‌సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తన అనుచరులతో బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. దీంతో పోలీసులు గ్రామంలో భారీబందోబస్తు నిర్వహించి ఎక్కడివారిని అక్కడే అడ్డుకున్నారు. రైతు వేదికలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారన్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్‌నాయకులు రైతువేదిక వైపు వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌నాయకులు రైతువేదిక నుంచి బయటకువచ్చి నినాదాలు చేస్తూ బీఆర్ఎస్‌నాయకుల వైపు వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరుపార్టీల నాయకులు నినాదాలు చేయడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పోటాపోటీగానినాదాలు చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతోపోలీసులు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని కోరుట్ల సర్కిల్ పరిధిలోని పలు పోలీసు స్టేషన్‌లకు తరలించారు. అక్కడేఉన్న కాంగ్రెస్ నాయకులను సముదా యించి పంపించి వేశారు. బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని నిరసిస్తూ ఆ పార్టీనాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అయిలాపూర్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు చోటు చేసుకోకుండా కోరుట్ల, మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు, అనిల్‌కుమార్, ఎస్ఐలు భారీ బందోబస్తు నిర్వహించారు.

పెన్షన్ల కోసం భవనం ఎక్కాల్సిందే

● సిగ్నల్స్ లేక లబ్ధిదారుల ఇబ్బందులు

మెట్‌పల్లి రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేయూత పథకం కింద అందిస్తున్న పింఛన్లకోసం లబ్ధిదారులు భవనాలు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్స్ లేక పంపిణీలో వృద్ధులు, దివ్యాంగ, వితంతు తదితర పెన్షన్‌దారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. శనివారం మెట్‌పల్లి మండలంలోని రంగరావుపేట గ్రామంలో పెన్షన్ కోసం గంటల కొద్దీ భవనాలపై పడిగాపులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వం పింఛన్ పంపిణీలో చేయూత యాప్‌లో ముఖ గుర్తింపు తప్పనిసరి చేసింది. దీంతో పెన్షన్ పంపిణీ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది. నూతన విధానం ప్రకారం పోస్టాఫీసు సిబ్బంది మొబైల్‌లోనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లబ్ధిదారుల ఫొటోలను అప్‌లోడ్ చేసి పెన్షన్ చెల్లించాలి. సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో నాలుగురోజుల నుంచి లబ్ధిదారులు భవనాలపై నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.



రంగరావుపేటలో సిగ్నల్ కోసం భవనం ఎక్కి దిగుతున్న వృద్ధులు, మహిళలు

కరీంనగర్‌లో పోలీసుల నాకా బందీ



నాకా బందీని పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా కరీంనగర్ పోలీసులు నగరవ్యాప్తంగా శనివారం రాత్రి ఏకకాలంలో నాఖాబందీ నిర్వహించారు. నగరంలోని కమాన్, ఒకటోరాణా ఎదుట, బస్టాండ్ చౌరస్తా, ఇందిరాచౌక్, రాంనగర్ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్, రాజీవ్‌చౌక్, కోర్టుచౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, నాకాచౌరస్తా, పద్మనగర్, ఎన్టీఆర్ చౌక్ తదితర 20 ప్రధానకూడళ్ల వద్ద చేపట్టిన నాకాబందీలో సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాలల్గొని వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు, ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలు, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవ్, సరైన ధ్రువపత్రాలు(డాక్యుమెంట్లు) లేని 50పైగా వాహనాలను గుర్తించి సీజ్‌చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు, భవిష్యత్‌లోనూ కొనసాగించనున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

భగత్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను శనివారం నగరంలోని సీపీఐజిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్రకార్యవర్గసభ్యులు మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)కి వందేళ్ల చరిత్ర ఉందని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ పార్టీని నిలువరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19నుంచి 22వరకు మేడ్చల్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్‌లో పంజాబ్ రాష్ట్రంలోని చండీఘడ్‌లో జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. పార్టీశ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నాయకులు పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, బ్రామండ్లపెల్లి యుగేందర్, మావురపు రాజు, బోనగిరి మహేందర్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను ఇప్పించండి

● జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను ఇప్పించాలని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడి 20నెలలు కావస్తున్నా ముఖ్య మంత్రి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు గ్రామాల్లో అభివృద్ధి పనులను గాలికి వది లేశారని ఆరోపించారు. జనహిత పాదయాత్రలు చేస్తున్న మీనాక్షి నట రాజన్ 2019-24వరకు తెలంగాణ గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులను చూసి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి పెండింగ్ బిల్లులను ఇప్పించాలన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని అప్పటి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి హామీనిచ్చాడని అన్నారు. గతంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని జేఏసీ ఆధ్వర్యంలో ధర్నాలు, పాదయాత్రలు, రాస్తారోకోలు చేపడితే కాంగ్రెస్ ప్రభుత్వం జేఏసీ నాయకులు, మాజీ సర్పంచ్‌లపై అక్రమ కేసులు పెట్టిందని ఉద్యమాన్ని అణచివేసిందని ఆరోపించారు. మంత్రి సీతక్క పెండింగ్ బిల్లులు రూ. 700 కోట్లు ఉన్నాయని విడతల వారిగా చెల్లిస్తామని హామీనిచ్చి ఇప్పటివరకు చెల్లించకపోవడం విచారకరమన్నారు. గ్రామాల్లో అప్పటి సర్పంచ్‌లు ప్రజల అభివృద్ధి కోసం తప్ప ఎవరి స్వంతంకోసం పనులు చేయలేదని ముఖ్య మంత్రి గ్రహించాలన్నారు. ఇప్పటికైనా మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లును చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో జనహిత పాదయాత్రలో ఉన్న మీనాక్షి నట రాజన్‌ను కలిసి సమస్యలను చెప్పుకోవడం కోసం తమకు సమయం ఇవ్వా లని కోరారు. ఈ సమావేశంలో తాజా మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర ఉపా ధ్యక్షులు గున్నాల లక్ష్మణ్, ఆరె మహేందర్, జిల్లా అధ్యక్షుడు దుమ్మ అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, రవినాయక్, రాసూరి రాజేష్, చిట్నేని శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



● మార్కెట్లోకి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్.. బహుమతులు

● నేడు ఫ్రెండ్‌షిప్ డే..

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్నేహానికి మించిన బంధం ఈ లోకాన లేదు. రక్త సంబంధీకులతో ముడిపడిన బంధాలకంటే ఎలాంటి బంధుత్వం లేకపోయినా జీవితాంతం తోడునీడగా ఆప్యాయత, అనురాగాలు పంచే బంధం స్నేహం. ప్రతి ఒక్కరికి ఎవరో ఒకరు ఆప్తమిత్రులుగా ఉంటారు.

● అండగా నిలుస్తున్న స్నేహాలు..

ఫేస్‌బుక్, ఎక్స్ ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌లో లైక్‌లు కొట్టడం, కామెంట్లు చేయడమే కాకుండా సామాజిక మాధ్యమాల ద్వారా కూడా కొంతమంది స్నేహితులు ఒక బృందంగా ఏర్పడి ఎంతో మందికి సహాయాన్ని అందిస్తూ ప్రశంసలను అందుకుంటున్నారు. ఒకరికి ఒకరు అండగా నిలుస్తున్నారు. చదువులు పూర్తిచేసి ఉద్యోగాలు చేస్తున్నవారు చదువుకుంటున్న విద్యార్థులు సైతం ఫౌండేషన్‌లుగా ఏర్పడి తోటి మిత్రులను ఆదుకుంటున్నారు. చిన్ననాటి మిత్రులందరు కలిసి తాము అక్షరాలు దిద్దుకున్న గ్రామాల్లోని పాఠశాలలను బాగు చేస్తున్నారు. స్నేహమంటే ఇది అంటూ యువత కొత్త నిర్వచనాన్ని అందిస్తున్నారు.

● ఫ్రెండ్‌షిప్‌డే నేపథ్యం ఇది..

గ్రీటింగ్ కార్డ్స్ తయారు చేసే హాల్ మార్క్ అనే సంస్థ వ్యవస్థాపకుడు జోయ్స్ సీ హాల్ స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించాలని 1919లో అనుకున్నాడు. ప్రజల్లో స్నేహ భావాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో 1935లో అమెరికా కాంగ్రెస్ ఫ్రెండ్‌షిప్ డేను నిర్వహించాలని తీర్మానించింది. అమెరికా దేశస్తులు 1935 ఆగస్టు 6న జాతీయ స్నేహ దినోత్సవాన్ని జరుపుకున్నారు. జూలై 30ని ప్రపంచ స్నేహ దినోత్సవంగా ఐక్యరాజ్యస మితి ప్రకటించింది. మనదేశంలో మాత్రం ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



● మార్కెట్‌లో ఫ్రెండ్‌షిప్ డే సందడి



ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా మార్కెట్‌లో సందడి కనిపించింది. పలు ప్రాంతాల్లో వెలసిన ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ల అమ్మకాల షాపులు జనంతో కిక్కిరిసిపోయాయి. ఆకట్టుకునే అందమైన బ్యాండ్‌లు షాపుల నిర్వాహకులు అమ్మకాలకు ఉంచారు. విద్యార్థులు, యువత ఆసక్తితో తిలకిస్తూ వాటిని కొనుగోలు చేశారు. విభిన్న రూపాల్లో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కనువిందు చేశాయి. దేశ విదేశాల్లో ఉన్న మిత్రులకు ఫోన్ ద్వారా ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. యువత స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అమ్మకాలు కొనసాగాయి.

ఉత్పత్తి దశలోకి ఆర్‌ఎఫ్‌సీఎల్

● 5వ తేది నుంచి యూరియా ఉత్పత్తి

● షట్‌డౌన్‌తో 60వేల టన్నుల ఉత్పత్తికి అంతరాయం



కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)లో శనివారం లైట్ అప్(ఉత్పత్తి దశ ప్రక్రియ) చేశారు. అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో జూలై 15వ తేది నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిపివేశారు. 25వ తేదీలోగా మరమ్మతు పూర్తి చేస్తారని అంచనా వేసినా సాధ్య పడలేదు. ఆర్‌ఎఫ్‌సీఎల్ మరమ్మతుల ప్రక్రియ ప్రారంభం కావడానికే నాలుగైదు రోజుల సమయం పట్టింది. ఢిల్లీ నుంచి సీఈవో అలోక్ సింఘాల్ ప్లాంట్‌కు రావడంతో మరమ్మతులు వేగవంతమయ్యాయి. రెండు వారాలపాటు ఆయన ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోనే మకాం వేశారు. పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న సమయంలో మరో డ్యామేజీని గుర్తించారు. దీంతో మరమ్మతుల్లో మరింత జాప్యం ఏర్పడింది. ప్లాంట్ షట్‌డౌన్ అయిన 18రోజుల తరువాత మరమ్మతుల ప్రక్రియ పూర్తయి శనివారం లైట్ అప్ చేశారు. ఈ నెల 5వ తేదీ నాటికి యూరియా ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రోజుకు 3850టన్నుల యూరియా ఉత్పత్తి సామర్థ్యం గల ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 18రోజులపాటు యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు 60వేల టన్నుల ఉత్పత్తి నష్టం జరిగింది. రూ.60 కోట్ల వరకు పరిశ్రమకు ఆర్థిక నష్టం జరిగింది. జూలై నెలలో తెలంగాణకు 30వేల టన్నుల యూరియా సరఫరా జరుగాల్సి ఉండగా ప్లాంట్ షట్‌డౌన్‌తో కేవలం 16వేల టన్నులు మాత్రమే సరఫరా చేశారు. తెలంగాణ రాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు యూరియా సరఫరా నిలిచిపోయింది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

జగిత్యాలరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తిమ్మాపూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళ డిగ్రీ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినిలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ గునుక శ్రీలత తెలిపారు. అండర్-20 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో బి. అక్షిత, 200 మీటర్ల పరుగు పందెంలో టి. పూజ, 400 మీటర్ల పరుగు పందెంలో ఎం. సాత్వికాంజలి ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఆగస్టు 3, 4 తేదీల్లో హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినిలను ప్రిన్సిపాల్ శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్ హరిరామ్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ముత్తయ్యరెడ్డి, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, తోటి విద్యార్థినిలు అభినందించారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

● ధర్మపురి, కొండగట్టు క్షేత్రాల్లో భక్తుల పూజలు



ధర్మపురిలో స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు



కొండగట్టు ఆలయ ఆవరణలో భక్తులు

ధర్మపురి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తులరద్దీ పెరిగింది. శ్రీలక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఉగ్రనరసింహ, వేంకటేశ్వర, రామలింగేశ్వరస్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్తహారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని జగిత్యాల జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి నారాయణ శనివారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: శ్రావణ శనివారం పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్న సన్నిధికి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతరాత్ర పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నేడు నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

తిమ్మాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (ఎండీ), మాస్టర్‌ఆఫ్‌సర్జరీ(ఎంఎస్), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పీజీ-2025 ప్రవేశ పరీక్ష ఆదివారం జరగనుంది. ఈ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ), పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్షకోసం నేషన్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్ పీజీ) ఇప్పటికే పూర్తి చేసింది. ఈ పరీక్ష ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగనుంది. ఈ ప్రవేశపరీక్ష ద్వారా పోస్ట్ ఎంబీ బీఎస్ డిప్లొమాట్ ఆఫ్ నేషనల్ బోర్డ్(డీఎన్‌బీ), డాక్టరేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ వంటి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందనున్నారు, ఈ పరీక్ష కోసం తిమ్మాపూర్ మండలంలో ఆయాన్ డిజిటల్ జోన్, వాగేశ్వరి, జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. అభ్యర్థులను పరీక్ష సమయానికి 45నిమిషాల ముందు మాత్రమే పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారు.

అవయవదానం సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అవయవ, నేత్రదానం సామాజిక బాధ్యత అని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ అన్నారు. శనివారం నగర పాలకసంస్థ కార్యాలయంలో మెప్మా ఆర్‌పీలకు నేత్ర, అవయవ, రక్తదానాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సదాశయ ఫౌండేషన్ సమన్వయంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు, ప్రతిఒక్కరూ అవయవ, నేత్రదానానికి ముందుకు రావాలని, ఒకటినుంచి 7వరకుజరిగే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో అన్నప్రసన్న మాట్లాడుతూ మరణాంతరంతోపాటు జీవించి ఉండగా కొన్ని అవయవాలు దానం చేయవచ్చునని, కాలెయం, క్లోమం, వెంట్రుకలు, చర్మందానం చేయవచ్చునని, రక్తదానంపై అపోహలు వీడాలని, ఏడాదిలో కనీసం 4నుంచి 5సార్లు రక్తదానం చేవచ్చునన్నారు. ఆర్‌ఎంవో రాజు, సదాశయ ఫౌండేషన్ ప్రచారకార్యదర్శి వాసు, లింగమూర్తి, సాన రామకృష్ణారెడ్డి, మెప్మా సీవో శమంత కమణి, టీఎంసీ మౌనిక పాల్గొన్నారు.

ఆకాశం వైపు అన్నదాత చూపు

● మెట్ట ప్రాంతాల్లో ముందుకు సాగని వ్యవసాయం ● ఎండలకు వాలిపోతున్న పత్తి.. బీడుగా పొలాలు

హుజూరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంత రైతులు వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. పదిరోజులుగా విపరీతంగా ఎండలు కొడుతుండడంతో పత్తిపంటలు వాలిపోతున్నాయి. రైతులు పోసిన నార్లు ముదిరిపోతున్నాయి. వ్యవసాయం ముందుకు సాగకుండా పొలాలన్నీ బీడుగా మారాయి. అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్నుకొని పత్తి రైతులు గింజలు విత్తారు. అప్పుడప్పుడు కురిసిన ముసురులకు పత్తి ఓ మాదిరిగా ఉండగా, పదిరోజులుగా కొడుతున్న ఎండలకు వాలిపోతున్నాయి. గత సంవత్సరం ముందుగా పత్తి సాగుచేసిన రైతులకు దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. ఈ సంవత్సరం కేంద్రప్రభుత్వం పత్తికి మద్దతుధర క్వింటాల్‌కు రూ.589పెంచడంతో పత్తిసాగుకు రైతులు మొగ్గు చూపారు. గత సంవత్సరం పత్తిక్వింటాల్‌కు రూ.7521 మద్దతు ధరఉండగా, ఈ ఏడాది పొడవైన పత్తికి రూ.8110, సాధారణ పత్తికి క్వింటాల్ రూ.7710 మద్దతుధర ప్రకటించింది. అలాగే మెట్టప్రాంతంలోని రైతులు వర్షాలు కురుస్తాయనే ఉద్దేశ్యంతో వరినార్లు పోశారు. అవికాస్త ముదిరిపోయే దశకు చేరుకుంది. ఈ సంవత్సరం పెద్దగా వర్షాలు కురిసిన దాఖలాల్లేవు. బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరగకపోవడంతో రైతులు పొలాలు దున్నక బీడులుగానే ఉంచారు. మెట్టప్రాంతాల్లో వర్షం పడితేనే వ్యవసాయపనులు ముందుకు సాగనున్నాయి. మరోవారం రోజుల్లో వరినాట్లు వేయకుంటే పోసిన వరినారు ఎందుకూ పనికిరాకుండా పోతుందని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు చెరువు, కుంటల్లోకి నీళ్లు వచ్చిన సందర్భాలు లేవు. డివిజన్‌లోని జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాలు ఉండగా, 1.20లక్షల ఎకరాల్లో సాగుభూమి ఉంది. అందులో సుమారు 20వేలఎకరాల్లో పత్తి, 80 ఎకరాల్లో వరి, 20వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు పడితేనే పంటలు పండే అవకాశంఉంది. లేనియెడల రైతులు అప్పుల్లో కురుకుపోయే పరిస్థితి నెలకొంది.



కాట్రపల్లిలో నీళ్లు లేక బీడుగా ఉన్న పొలాలు



ఇప్పల్‌నర్సింగాపూర్‌లో వడలిపోతున్న పత్తి

● నీటి కోసం ఎదురుచూపులు..

హుజూరాబాద్ ఎస్సారెస్పీ ఆయకట్టు కింద నీళ్లు వస్తాయనే ఉద్దేశ్యంతో రైతులు కొద్దిపాటి కురిసిన వర్షాలకు, బావుల్లోఉన్న నీటితో కొంత మేర పొలాలు దున్ని నాట్లువేశారు. మిగితా రైతులు నీళ్లలేక పొలాలన్నీఅలాగే వదిలేశారు. ఇప్పటివరకు ఆయకట్టుకింద 50శాతం మాత్రమే వరినాట్లు వేశారు. ఆయకట్టు కిందనాట్లు వేసిన రైతులు నీళ్లలేక పొలాలు పారకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎల్‌ఎండీ నీళ్లకోసం ఎదురుచూస్తున్నారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

● ప్రాజెక్టులోకి 4,352 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం స్వల్పంగా వరద నీరు వచ్చింది. డ్యామ్‌లోకి 4,352 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 39.188 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 774 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 29.690 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.485 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

సుభాష్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా నగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌వెంకటరమణ బృంద సభ్యులతో కలిసితనిఖీచేశారు. ప్రైవేట్ హాస్పిటల్ పనితీరు, వారు నిర్వహించే రిజిస్టర్లు, పేషెంట్ అనుమతిపత్రాలు, కేస్‌రికార్డ్స్, సంబంధిత డాక్యుమెంట్స్‌ను పరిశీలించారు. నిపుణులైన గైనకాలజిస్టు, ఇతరక్వాలిఫైడ్ స్పెషలిస్టుల ఒరిజినల్ సర్టిఫికెట్స్, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను పరిశీలించారు. ప్రైవేట్‌హాస్పిటల్స్‌లో ప్రసవాలు జరిగిన గంటలోపు తల్లిపాలు శిశువులకు అందించడంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం హౌసింగ్ బోర్డులోని ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సీహెచ్ఎం హెచ్‌ఎన్ డాక్టర్ సనజవేరియా, సీడీపీవో సబిత, పట్టణఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

నాందేడ్ టు తిరుపతి ప్రత్యేక రైలు సమయంలో మార్పు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల పాటు నాందేడ్ టు తిరుపతి, తిరుపతి టు నాందేడ్ నడిచే ప్రత్యేకరైలు రాకపోకల సమయంలో మార్పులుచేస్తూ దక్షిణమధ్య రైల్వే అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతనెల26 నుంచి నాందేడ్ నుంచి కరీంనగర్ మీదుగా తిరుపతికి ప్రత్యేక రైలును నడిపిస్తున్నట్లు, ఈనెల 2నుంచి జగిత్యాల, కరీంనగర్ రైల్వేస్టేషన్లకు వచ్చే సమయంలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. నాందేడ్‌లో ప్రతీ శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయల్దేరి ముదుఖేడ్, బాసర, నిజామాబాద్ మీదుగా జగిత్యాలకు రాత్రి 8:30 గంటలకు, కరీంనగర్‌కు రాత్రి 9 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. మరుసటిరోజు ఆదివారం ఉదయం 11:30 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని, అదేరోజు సాయంత్రం 4గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి మరుసటి రోజు సోమవారం ఉదయం 9.08గంటలకు కరీంనగర్ చేరుకొని నాందేడ్ బయల్దేరుతుందని పేర్కొన్నారు. ఈ నెలలో ప్రతీ శనివారం 2, 9, 16, 23, 30తేదీల్లో నాందేడ్ నుంచి తిరుపతికి, ప్రతీ ఆదివారం 3, 10, 17, 24, 31 తేదీల్లో తిరుపతి నుంచి నాందేడ్‌కు రైలు నడుస్తుందని తెలిపారు. రైలు రాకపోకల సమయంలో మార్పుతతో కరీంనగర్, జగిత్యాల రైల్వే స్టేషన్లకు గతంలో కంటే అరగంట ముందుగా చేరుకుంటుందని కరీంనగర్ రైల్వే స్టేషన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ భానుచందర్ పేర్కొన్నారు.

విద్యార్థులకు సంగీతంలో శిక్షణ

● పీఎం శ్రీ పథకంలో పాఠశాలలు ఎంపిక

● ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు తమకు అభిరుచి ఉన్న కళారంగంలో రాణించడానికి సంగీతంపై శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పరిపూర్ణ అభ్యసనకు దోహదపడే అంశాలను వారికి అందుబాటులోకి తెచ్చి పాఠశాల విద్యను బలోపేతం చేస్తున్నాయి.



ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) యోజన ద్వారా రాష్ట్రంలో 832 బడులు ఎంపికయ్యాయి. కరీంనగర్ జిల్లాలో 22 ప్రభుత్వ పాఠశాలు ఎంపిక కాగా సంగీత తరగతులు నిర్వహించడానికి తొలి విడతలో 13, రెండో విడతలో తొమ్మిది పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ మ్యూజిక్ క్లాస్‌లు చెప్పించాలని, రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. వీటిలో కొన్ని పాఠశాలలకు వయోలిన్, తబలా, మృదంగం, హార్మోనియం, మరికొన్ని పాఠశాలలకు బ్యాండ్ సంగీత పరికరాలను అందించనున్నారు. పీఎం శ్రీ పథకం కింద ఎంపిక చేసిన ఒక్కో పాఠశాలకు లక్ష రూపాయల చొప్పున అందనున్నాయి. ఈ మేరకు ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు సంగీతాన్ని నేర్పించనున్నారు. వారానికి ఒక క్లాస్ చొప్పున ఆయా పరికరాలతో శిక్ష ఇప్పిస్తారు. త్వరలో సంగీత తరగతుల నిర్వహణపై ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్‌కు శిక్షణ ఇస్తారు.

PM SHRI

● సంగీత బోధనకు ఉపాధ్యాయులు

సంగీత పాఠాలు చెప్పేందుకు పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని అధికారులు భావిస్తున్నారు. దానికి సంబంధించిన పూర్తి మార్గ దర్శకాలు వచ్చిన తర్వాత జిల్లా అధికారులు పర్యవేక్షణలో సంగీత పాఠాలు నేర్పిస్తారు.

చిట్టి చేతులతో విత్తన బంతులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులచే శనివారం విత్తన బంతులు తయారు చేయించారు. వీటిని అటవీ అధికారుల సమక్షంలో విద్యార్థుల చేత స్థానిక కొండ ప్రాంతంలోని అటవీ భూమిలో వెదజల్లించారు. విత్తన బంతులను తయారు చేయించిన పాఠశాల ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌ను అటవీ అధికారులు అభినందించారు.

కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ చైతన్యశ్రీ, బీట్‌అధికారి మధుసూదన్, ప్రధానో పాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, నరేష్, అశోక్, స్వామి, రాజేంద్ర ప్రసాద్, భూలక్ష్మి, సుమతి పాల్గొన్నారు.



విత్తన బంతులు వెదజల్లుతున్న విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఇల్లంతకుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని ఎంపీడీవో శశికళ పేర్కొన్నారు. కందికట్కూర్ గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో శనివారం వనమహోత్సవం, కిచెన్‌గార్డెన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారానే ఆరోగ్యవంతమైన జీవితాన్ని కొనసాగిస్తామన్నారు. సకాలంలో వర్షాలు కురుస్తాయని, స్వచ్ఛమైన గాలి వస్తుందన్నారు. మొక్కలు నాటడానికి విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అనువోజు రాజు, లక్ష్మి, శ్రీనివాస్‌లతో పాటు గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల పరిశీలన

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ప్రభుత్వం చేపట్టిన నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం పరిశీలించారు. స్లాబ్ దశకు పనులు చేరుకున్నాయని పేర్కొన్నారు. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాయకులు నర్సయ్య, గౌస్, రాంరెడ్డి, బాబు, రాజ్‌కుమార్, బాల్‌రెడ్డి, షకీల్ తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు సామాజిక సేవలో ముందుండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పద్మావతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో ముందుండాలని ప్రిన్సిపాల్ పద్మావతి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు జాతీయ సేవా పథకంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవను అలవర్చుకోవాలని అన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతోందని అన్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకుని గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయాలని ప్రిన్సిపాల్ పద్మావతి సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో గంగాధర్, అధ్యాపకులు సత్యనారాయణ, చంద్రమౌళి, పర్శరాములు, రవిచంద్ర, శ్రీను, భూమక్క, కవిత, సౌమ్య, గౌతమి పాల్గొన్నారు.

హై ఓల్టేజీతో కాలిపోయిన విద్యుత్ పరికరాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో హై ఓల్టేజీతో శనివారం విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. పాఠశాలలోని టీవీ, స్టార్టర్ డబ్బాలో మంటలు వ్యాపించాయి. సిబ్బంది అప్రమత్తమవడంతో ప్రాణాపాయం తప్పినట్లయింది. ఇటీవల విద్యుత్తు సరఫరాలో తరచూ సమస్య తలెత్తడం వల్ల పరికరాలు కాలిపోతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. 'సెస్' అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ..

తంగళ్లపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పుట్టినరోజును పురస్కరించుకుని మోదీ కానుక పేరుతో పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ జరుగుతోంది. దీంట్లో భాగంగా శనివారం తంగళ్లపల్లి మండలంలోని తాడురు, మండేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు పార్లమెంట్ కోకన్వీనర్ ఆడేపు రవీందర్, బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు చేతుల మీదుగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలో పాఠశాల హెచ్ఎంలు బూర రవీందర్, కూనబోయిన వేణు, బీజేపీ నాయకులు తోట రాజు, ఇటికల రాజు, కోస్నీ వినయ్ యాదవ్, రెడ్డిమల్ల ఆశీర్వాద్, బోల్గం భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతి కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యం



బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పల్లెల ప్రగతి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లితండాలో ఎంపీ నిధులతో బోరుబావి తవ్వకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులను కేటాయిస్తోందన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించి నిధులను మంజూరుచేస్తున్నారన్నారు. జిల్లాలోని గ్రామాల్లో అవసరమైన చోట నీటి వసతి కల్పించేందుకు బోరు బావులను వేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, బుగ్గారెడ్డి, నరేశ్, గణేశ్, రవీందర్, సుధాకర్, అఖిల్, బాలకృష్ణ, కిరణ్‌నాయక్, యాదగిరి, ప్రశాంత్, చరణ్, గణేశ్‌నాయక్, జవహర్, తిరుపతి, రాజు, రజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

తంగళ్లపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కారించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్ గౌడ్ అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండలంలో పలు పాఠశాలల్లో టీఆర్టీఎఫ్ సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి పరిష్కారించాలని కోరారు. ప్రతి పాఠశాలకు స్కావెంజర్‌ను నియామకానికి ఆదేశాలిస్తు వారి వేతనాలు స్వంత అకౌంట్‌లో జమఅయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఉన్న 5 డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీ అమలు, ఉద్యోగ ఉపాధ్యాయుల, పెన్షనర్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారయణ, మండల అధ్యక్షుడు బూట్ల శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యుడు ఆసాని అనిల్‌రెడ్డి, నాయకులు చెక్కిళ్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

గంభీరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం దమ్మన్నపేట మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశం పొందటానికి సోమవారం స్పాట్ అడ్మిషన్స్ సౌకర్యం కల్పించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. ఆసక్తిగల వారు పాఠశాలలో సంప్రదించి స్పాట్ అడ్మిషన్ పొందాలన్నారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీలత కోరారు.

'ఇందిరమ్మ' ఇళ్లపై అనాసక్తి..

- పైలట్ ప్రాజెక్ట్ గ్రామంలో ముగ్గు పోయని లబ్ధిదారులు - 184 మందికి మంజూరు.. 98 ఇళ్లు రద్దు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నీడలేని నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల పథకం' ఆదిలోనే హంసపాదుగా మారింది. మొదటి విడత ప్రయోగాత్మకంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగుండారం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. ఇళ్లు లేని పేదల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి స్వంత స్థలం ఉన్న 184 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలను అందజేసింది. ప్రభుత్వం అందిస్తున్న డబ్బులు ఇంటి నిర్మాణానికి సరిపోవనే భావనతో లబ్ధిదారుల్లో నిరాసక్తత నెలకొంది. నాలుగు నెలలు గడుస్తున్నా లబ్ధిదారులు ముగ్గు పోయకపోవడంతో గ్రామంలో 98 ఇళ్లు రద్దయ్యాయని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పైలట్ ప్రాజెక్ట్ గ్రామంలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగత గ్రామాల్లో పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.



ముగ్గు పోసి మధ్యలోనే నిలిపివేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

ఆర్థిక స్తోమత లేక.. లబ్ధిదారుల వెనకడుగు

ఎల్లారెడ్డిపేట మండలంలోని గుండారం గ్రామాన్ని అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. గ్రామం లో మొత్తం 311 మంది ఇంటి నిర్మాణాలకు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. 184 మంది అర్హు లని గుర్తించి ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. స్వంత స్థలం ఉన్నా.. ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులు వెనకడుగు వేశారు. ప్రభుత్వం స్వయంసహాయక సంఘాల ద్వారా రూ.లక్ష రుణం ఇప్పిస్తామని పేర్కొన్నా సకాలంలో అందకపోవడంతో ముగ్గుపోయకుండా ఉండిపోయారు. తాము ఇళ్లు కట్టుకోలేమని తేల్చిచెబుతున్నారు. దాంతో గ్రామంలో 98 ఇళ్లను రద్దు చేశామని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నిర్మాణానికి ముందుకు రాకపోవడంతోనే రద్దు

- సత్తయ్య, ఎంపీడీవో



మండలంలోని రాచర్లగుండారం గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి అర్హులైన 184 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశాం. వారిలో 86 మంది ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టారు. వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. మరో 98 మంది వివిధ కారణాలతో పనులను ప్రారంభించలేదు. తాము ఇళ్లు కట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేదని స్పష్టం చేయడం వల్ల ఇళ్లను రద్దు చేశాం. తిరిగి ఇళ్లు నిర్మించుకుంటామని ముందుకు వస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవకాశం కల్పిస్తాం.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు..

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- రుద్రంగిలో మోడల్ హౌస్‌ను ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు లేని నిరుపేదల కోసం ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో బస్టాండ్‌వద్ద ఇందిరమ్మ నమూనా గృహం నిర్మించగా శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రంగిలో భూమి ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం మంజూరు పత్రాలు అందజేశామన్నారు. స్థలం లేని నిరుపేదలకు త్వరలోనే స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. దీనికోసం వెంటనే ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. ఇళ్లు పొందిన ప్రజలు అభిమానంతో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలు పెట్టుకుంటునారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, హౌసింగ్ పీడీ శంకర్, డీఈ ముజఫరుద్దిన్, తహసీల్దార్ పుష్పలత, ఏంపీడీవో నటరాజ్, ఏఈ రాజ్‌మహన్, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కోమరె శంకర్, గండి నారాయణ, కెసిరెడ్డి నర్సారెడ్డి, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, తర్రె లింగం, పూదరి మహిపాల్, దసారి గంగారాజం, ఎర్రం ఆరవింద్, దయ్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

ఇల్లంతకుంట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తు మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిరసన చేపట్టారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనం ఎదుట శనివారం సిబ్బందికి సమ్మె నోటీసు అందించారు. ఈసందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి మీసం లక్ష్మన్ మాట్లాడుతు మధ్యాహ్న భోజన, కోడిగుడ్ల బిల్లులు పదినెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు మెనిఫెస్టోలో పెట్టినట్లు రూ 10వేత వేతనాన్ని చెల్లించాలన్నారు. మధ్యాహ్నభోజనానికి అవసరం అయిన నిత్యావసర వస్తువులు ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో ఈనెల 6.7 తేదీలలో వంటలు నిలిపివేసి నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన సానుకూలంగా స్పందించాలని లేనట్లయితే వచ్చే నెల నుంచి సమ్మెకు వెలుతామన్నారు. కార్యక్రమంలో నర్సవ్వ, సంతోష, బాలమణి, లత, రేణుక, లక్ష్మి, రాజవ్వ, మమత తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

వధువుల వేట..

(5వ పేజీ తరువాయి)

తరువాత వివాహాలు చేసుకోవడం.. ఇద్దరూ సంపాదన రంగంలో ఉండడం.. వంటి అంశాలు కూడా ముందుకు వస్తున్నాయి. గతంలో 18ఏళ్లలోపే ఏ పని చేసినా చేయకపోయినా పెద్దలు వివాహాలు జరిపించే వారు. ఇప్పుడు మారుతున్న కాలంలో ఉన్నత చదువులు, ఆర్థికంగా స్థిరపడిన తరువాతే వివాహం చేసుకోవాలని భావిస్తుండడంతోనే 40 ఏళ్లు దాటినా పెళ్లిళ్లు కావడం లేదు. దీంతో చివరకు ఎవరైనా సరే అనుకున్నప్పటికి అమ్మాయిలు మాత్రం దొరకడం లేదు. కట్నకానుకలు పట్టింపులేదని అబ్బాయిలు ముందుకు వచ్చినా అమ్మాయిలు కనీసం డిగ్రీ చదివి ఉండాలని కోరుతున్నారు. ఉద్యోగులు కావాలని పిల్ల తల్లిదండ్రులు చూస్తుండడంతో వ్యాపార రంగంలో ఉన్న యువకులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పెళ్లి కాని ప్రసాద్‌ల సంఖ్య రోజురోజుకు పెరగడానికి మరో కారణం అమ్మాయిల సంఖ్య తగ్గిపోవడమేనని లెక్కలు చెబుతున్నాయి. యువకులతో పోల్చుకుంటే యువతుల సంఖ్య తక్కువగా ఉండడంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. అందుకే మ్యారేజ్ బ్యూరోలు కూడా పెరిగిపోతున్నాయి. మ్యారేజ్ బ్యూరోల వద్ద అమ్మాయిలు కావాలనే వారి సంఖ్యనే ఎక్కువగా ఉంది. ఒక మ్యారేజ్ బ్యూరోలో రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది వధూవరులు పేర్లు నమోదు చేసుకుంటే, అందులో 30వేల మంది అబ్బాయిలు ఉండడం గమనార్హం.

పోచమ్మ దేవస్థాన కమిటీ అధ్యక్షుడిగా అంతగిరి



నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మ దేవస్థాన కమిటీ అధ్యక్షుడుగా కోలపురి అంతగిరి నియామకం అయ్యాడు. మానకొండూర్ నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం నియామక పత్రాన్ని అందించారు. డైరెక్టర్లుగా గొట్టిపర్తి ముత్యంగౌడ్, పల్లె తిరుపతిరెడ్డి, కుంబం ముత్తయ్య, ఎలుకపెల్లి మల్లయ్య, మిడిదొడ్డి శంకరయ్య, చెన్ని పోచవ్వలు నియామకం అయ్యారు. ఆలయ అభివృద్ధికి పాలకవర్గం కృషిచేయాలని ఎమ్మెల్యే సూచించగా, నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్యాక్స్‌చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, గుడ్ల నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిది..



చెక్కులు పొందిన లబ్ధిదారులతో కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు రూ.12,92,000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేసి మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో తోడ్పాటును అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్లు నాగరాజు, వెంగలి వెంకన్న, లింబయ్య, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొర్ర రవీందర్, రమేష్‌రెడ్డి, చారి, రుక్మిణి, కె బాల్ రెడ్డి, నందు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా కౌడగాని పద్మ

బోయినపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా బోయినపల్లి మండలం రత్నంపేట గ్రామానికి చెందిన కౌడగాని పద్మ-వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఇంచార్జి కృష్ణ అల్లావేరు శనివారం ఉత్తర్వు పత్రాన్ని జారీ చేశారు. గ్రామంలోని కౌడగాని పద్మ-వెంకటేశ్ గత నాలుగేళ్లుగా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకురాలుగా చురుకుగా పార్టీ బలోపేతం కోసం పని చేశారు. తెలంగాణ మహిళా శక్తి అభియాన్, ఇందిరా మహిళా ఫెలోషిప్ కార్యక్రమంలో గత 9 నెలలుగా అంతర్గత శిక్షణ పొందారు. మహిళల అభ్యున్నతికి పాటు పడడంతో పాటు పార్టీ పటిష్టతకు విశేష కృషి చేశారు. ఆమెను గుర్తించిన ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఇంచార్జి కృష్ణ అల్లావేరు రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. తన నియమానికి కృషి చేసిన ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభాను చిబ్, తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జీ మహ్మద్ ఖలీద్, ఇందిరా ఫెలోషిప్ కో-ఆర్డినేటర్ సల్ల సౌజన్య, శివలాల్‌లు, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గంభీరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశ పరీక్ష ప్రకటనను అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు విడుదల చేశారని తెలిపారు. డిగ్రీలో కొత్తగా అడ్మిషన్ పొందాలనుకునే వారు విద్యార్థిని, విద్యార్థులు, ప్రభుత్వ రంగంలోను ప్రేవేటు రంగంలో ఉద్యోగాలు చేస్తున్న వ్యక్తులు కూడా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చదవటానికి మంచి అవకాశంగా భావించి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు ఓపెన్ ఇంటర్, ఐటీఐ ఒకేషనల్ కోర్సులు, 10 ప్లెస్ 2 కోర్సులు ఉత్తీర్ణత అయిన వాళ్లు డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందటానికి అర్హులని తెలిపారు. ప్రవేశాలకు ఈనెల 13 చివరి తేదీ అని తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరటానికి ఆన్‌లైన్‌లో అప్లై చేసి, దరఖాస్తుతో పాటు ఇంటర్మీడియట్ పాసైన సర్టిఫికెట్, పదవ తరగతి సర్టిఫికెట్లు, కులం, ఆధార్ కార్డు ధ్రువ పత్రాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సీటీ స్టడీ సెంటర్‌లో(ఎల్ఎస్‌సీ-230) దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సమన్వయకర్త వాణి తెలిపారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధ్యాపకులు

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు..



పతకాలు సాధించిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జావిలిన్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జావెలిన్ త్రో పాటు వివిధ విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 13 మండలాల నుంచి 8, 10, 12, 14, 16, 18, 20 సంవత్సరాలలోపు ఉన్న విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 25మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి, కాంస్య పతకాలతో పాటు అసోసియేషన్ ప్రశంసా పత్రాలను అందించి అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జావిలిన్ త్రో ఒలంపిక్స్‌లో నీరజ్ చోప్ర బంగారు పతకం సాధించినందుకు ప్రతి సంవత్సరం జావిలిన్ డే నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జావిలిన్ త్రో, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ నెల 7న జనగామలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన 25 మంది విద్యార్థులను పంపించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టె రామచంద్రం, కార్యనిర్వహక కార్యదర్శి కనకం శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్, స్వప్న, నాయక్ పాల్గొన్నారు.

పొలంబాట పట్టిన గురుకుల విద్యార్థినులు

ఇల్లంతకుంట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీగురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు శనివారం పొలంబాట పట్టి వరినాట్లు వేశారు. మిషన్ ప్రకృతి కార్యక్రమంలో భాగంగా ఆహారం ఎలా ఉత్పత్తి అవుతుందో తెలుసుకోవాలనే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు తస్లీమా, రమాదేవి పాల్గొన్నారు.

● చందుర్తి : గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా అసిరెడ్డిపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అనుబంధ మహాత్మ జ్యోతిబా పూలే కళాశాల విద్యార్థులు పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శించిన విద్యార్థులు

ఇల్లంతకుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని కేరళ మాడల్ పాఠశాల విద్యార్థులు శనివారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఎస్సై శ్రీనివాస్‌రావు పోలీస్ అధికారుల విధులు, అందిస్తున్న సేవలను వివరించారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే ఎలా వ్యవహరించాలి, హెల్ప్‌లైన్ నెంబర్లు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, ఉపాధ్యాయులు టీస్సీ, లావణ్య, థేరిస్సా, పోలీస్ సిబ్బంది షసియొద్దీన్, శ్రీనివాస్, బాల్‌రెడ్డిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వనం నుంచి జనంలోకి వచ్చిన నెమలి

గంభీరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వనం నుంచి జనంలోకి ఓ నెమలి వచ్చింది. సీతారాంబజార్‌లోని ఓ బోరు వద్దకు శనివారం నెమలి వచ్చి నీళ్లు తాగింది. వేసవిలో నీళ్ల కోసం ఎన్నోసార్లు జనంలోకి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. వర్షాకాలంలో కూడా వణ్య ప్రాణులు నీళ్ల కోసం రావడం పలువురిని ఆశ్చర్యపరిచింది.